క్లుప్తంగా

చిన్నారులకు ఎన్నెస్సార్ ట్రస్ట్ చేయూత

కొడవలూరు: తల్లిదండ్రులను కోల్పోయిన చిన్నారులకు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి చేయూతనందించారు. నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా రూ.1.45 లక్షల సాయాన్ని అందజేశారు. మంగళవారం గడప గడపకు మన ప్రభుత్వంలో భాగంగా ఎమ్మెల్యే ప్రసన్న కొడవలూరులో పర్యటించారు. ఆ సమయంలో తల్లిదండ్రులు కోల్పోయిన చిన్నారులకు ఆర్థిక సాయం అందజేస్తానని హామీ ఇచ్చారు. ఈ మేరకు కొడవలూరుకు చెందిన నంబూరు నానీకి రూ.20 వేలు, నంబూరు గంగాభవానీకి రూ.20 వేలు, రేణుకశ్రీకి రూ.20 వేలు, అరిగెల తనయ్‌కుమార్‌కు రూ.20 వేలు, ఎస్ జోషితకు రూ.20 వేలు, ఎస్ నిహారికకు రూ.20 వేలు, దళితవాడకు చెందిన మన్యం అక్షయ్‌కు రూ.25 వేలు చొప్పున బ్యాంకులో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేశారు. బుధవారం కోవూరులో చిన్నారుల కుటుంబ సభ్యులకు బాండ్లు అందజేశారు. డీసీఎమ్మెస్ చైర్మన్ వీరి చలపతిరావు, నాయకులు ఒట్టూరు సునీతమ్మ, నక్కా తిరుపతమ్మ, పొబ్బా రవి, షఫీ, తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్ ఫైనాన్స్ సంస్థల ఉచ్చులో పడొద్దు

కోవూరు: ప్రైవేట్ ఫైనాన్స్ సంస్థల ఉచ్చులో పడొద్దని డీఆర్డీఏ పీడీ సాంబశివారెడ్డి పొదుపు సభ్యులకు సూచించారు. కోవూరులోని ప్రైవేట్ ఫైనాన్స్ కార్యాలయాలను బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొదుపు సంఘాలకు బ్యాంకులు, అనుబంధ సంస్థల ద్వారా రూపాయి వడ్డీకే రుణాలు ఇస్తున్నామని తెలిపారు. 2022–23 ఆర్థిక సంవత్సరంలో జిల్లాలోని పొదుపు సంఘాలకు రూ.1030 కోట్ల రుణాలు ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకోగా, అంతకుమించి రూ.1049 కోట్లు రుణంగా ఇచ్చామని వివరించారు. 2023–24 ఆర్థిక సంవత్సరంలో రూ.1031 కోట్ల రుణాలు ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. ప్రభుత్వం పొదుపు సభ్యుల ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా బ్యాంకు లింకేజీ రుణాలు మంజూరు చేస్తుంటే ప్రైవేట్ ఫైనాన్స్ సంస్థలను ఆశ్రయించి మోసపోవడం మంచిదికాదన్నారు. బ్యాంకు లింకేజీ రుణాలను సకాలంలో తిరిగి చెల్లించి ఆర్థికంగా స్థిరపడాలన్నారు. జిల్లాలోని ప్రైవేట్ ఫైనాన్స్ సంస్థలపైన ప్రత్యేక దాడులు నిర్వహించాలని ఉన్నతి అధికారుల ఆదేశాలు జారీ చేశారని తెలిపారు. ఈ మేరకు ఆరు బృందాలుగా ఏర్పడి కందుకూరు, కావలి, బోగోలు, ఆత్మకూరు, నెల్లూరు, తదితర ప్రాంతాల్లోని ప్రైవేట్ ఫైనాన్స్ సంస్థల కార్యాలయాల్లో తనిఖీలు నిర్వహించామని తెలిపారు. ఆర్‌బీఐ సూచించిన పదమూడు అంశాలకు సంబంధించి ఐదురోజుల్లో వివరణ ఇవ్వాలని నోటీసులు జారీ చేశామన్నారు. ఐదురోజుల్లో వివరణ ఇవ్వకపోతే కలెక్టర్ ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లోని పొదుపు మహిళలను అమాయకులుగా పరిగణించి నగదు ఆశ చూపించి ఎక్కువ వడ్డీకి రుణాలు ఇవ్వడం మంచిపద్ధతి కాదన్నారు.

సచివాలయంలో తనిఖీలు

కోవూరు సచివాలయం–2ను డీఆర్డీఏ పీడీ సాంబశివారెడ్డి తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు. ప్రజల సమస్యలను సత్వరమే పరిష్కరించాలన్నారు. 90 శాతం హాజరు తప్పనిసరిగా ఉండేలా చూసుకోవాలన్నారు.

గిరిజన చిన్నారి వైద్యానికి నగదు సాయం

కోవూరు: గుమ్మళ్లదిబ్బ ప్రాంతానికి చెందిన గంధళ్ల అమరబాబు, సుభాషిణి దంపతుల చిన్నారి ప్రణవి వైద్యఖర్చులకు డీఏఏబీ చైర్మన్ దొడ్డంరెడ్డి నిరంజన్‌బాబురెడ్డి బుధవారం రూ.20వేలు సాయం అందజేశారు. మూడేళ్ల చిన్నారి ప్రణవికి గుండెలో రంధ్రం ఏర్పడడంతో తల్లిదండ్రులు చెన్నైలోని అపోలో ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్నారు. ఈ విషయం ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి దృష్టికి రావడంతో వెంటనే చిన్నారికి రూ.20వేలు ఆర్థిక సాయం చేయాలని నిరంజన్‌బాబురెడ్డికు సూచించారు. ఈ మేరకు పార్టీ కార్యాలయంలో చిన్నారి తల్లిదండ్రులకు నగదు అందజేశారు. వైఎస్సార్‌సీపీ చేనేత విభాగం జిల్లా అధ్యక్షుడు పన్యం సుధాకర్, ఎంపీటీసీ విజయసేనారెడ్డి, శివకుమార్‌రెడ్డి, ఎస్ సాయి, తదితరులు పాల్గొన్నారు.

బైక్‌లు ఢీకొని ఇద్దరికి గాయాలు



బుచ్చిరెడ్డిపాళెం: రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు తీవ్రగాయాలపాలయ్యారు. ఈ ఘటన మండలంలోని సాల్మన్‌పురం వద్ద బుధవారం చోటు చేసుకుంది. స్థానికులు, పోలీస్‌ల వివరాల మేరకు..మండలంలోని పెనుబల్లికి చెందిన పాట్టే వికాస్ బైక్‌పై బుచ్చిరెడ్డిపాళేనికి వస్తున్నాడు. పంచేడుకు చెందిన మరో యువకుడు బైక్‌పై నెల్లూరు వెళుతున్నాడు. సాల్మన్‌పురం వద్ద రెండు బైక్‌లు ఎదురెదురుగా బలంగా ఢీకొనడంతో ఇద్దరు యువకులు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను స్థానికులు 108 వాహనంలో నెల్లూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

అలసత్వం వహిస్తే చర్యలు



మాట్లాడుతున్న హరినారాయణన్

- కలెక్టర్ హరినారాయణన్

నెల్లూరు(మినీబైపాస్): జగనన్న కాలనీల్లో చేపట్టిన గృహ నిర్మాణాలను పక్కా ప్రణాళికతో త్వరితగతిన పూర్తి చేయాలని, అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని కలెక్టర్ హరినారాయణన్ హెచ్చరించారు. కలెక్టరేట్లోని తన చాంబర్‌లో మున్సిపల్ కమిషనర్లు, ఇంజినీర్లతో బుధవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. గృహ నిర్మాణాలు త్వరితగతిన పూర్తయ్యేలా అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. గృహాల నిర్మాణానికి గానూ స్వయం సహాయక సంఘాల వారికి రుణాలు మంజూరు చేసేందుకు మెప్మా అధికారులు చర్యలు చేపట్టాలని చెప్పారు. జేసీ కూర్మనాథ్, కమిషనర్ వికాస్ మర్మత్, ట్రెయినీ కలెక్టర్ విద్యాధరి, హౌసింగ్ పీడీ వెంకటదాస్, మెప్మా పీడీ రవీంద్ర, ఎల్డీఎం శ్రీకాంత్ ప్రదీప్, తదితరులు పాల్గొన్నారు.

నరసింహకొండలో 30 నుంచి బ్రహ్మోత్సవాలు



మాట్లాడుతున్న సురేంద్రరెడ్డి

నెల్లూరు రూరల్: నరసింహకొండపై వెలసిన వేదగిరి లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలను ఈ నెల 30 నుంచి వచ్చే నెల పది వరకు నిర్వహించనున్నామని ఆలయ చైర్మన్ సురేంద్రరెడ్డి, ఈఓ గిరికృష్ణ పేర్కొన్నారు. ఆలయంలో విలేకరులతో బుధవారం వారు మాట్లాడారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని శాఖల సమన్వయంతో సౌకర్యాలను కల్పించనున్నామని పేర్కొన్నారు. పటిష్ట బందోబస్తును ఏర్పాటు చేయనున్నామని తెలిపారు., భక్తుల సౌకర్యార్థం ఆర్టీసీ బస్సులను నడపనున్నారని వివరించారు.

అజెండాలోని అంశాలను ప్రభుత్వానికి తెలియజేయరూ..



కమిషనర్‌కు వినతిపత్రమిస్తున్న కార్పొరేటర్లు

నెల్లూరు(బారకాసు): నగరపాలక సంస్థ సర్వసభ్య సమావేశంలో ప్రవేశపెట్టిన అజెండాలోని అంశాలను 44 మంది కార్పొరేటర్లు వ్యతిరేకిస్తున్నారని, ఈ అంశాన్ని ప్రభుత్వానికి తెలియజేయాలని పలువురు కార్పొరేటర్లు కోరారు. ఈ మేరకు కమిషనర్ వికాస్ మర్మత్‌కు వినతిపత్రాన్ని బుధవారం అందజేసిన అనంతరం కార్పొరేటర్ శ్రీనివాసయాదవ్ మాట్లాడారు. అజెండాలోని అంశాలను అధిక శాతం మంది కార్పొరేటర్ల ఆమోదం లేకుండానే మేయర్ ఆమోదించినట్లు ప్రకటించారని, ఇది ఏ మాత్రం సరికాదన్నారు. నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే మద్దతుదారులుగా ఉన్న కార్పొరేటర్ల డివిజన్లకు మాత్రమే అనుకూలంగా అజెండాను రూపొందించి ఆమోదించడం ఎంతవరకు సబబని ప్రశ్నించారు. మేయర్‌ను తామెక్కడా అగౌరవపర్చలేదని.. రూరల్ ఎమ్మెల్యే సోదరుడు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి సలహా మేరకు ఆమె తమపై తప్పుడు కేసులు పెట్టారని ఆరోపించారు. తనకు కూతురితో సమానమని, రాజకీయ అనుభవం లేకపోయినా అదృష్టం కొద్దీ మేయరయ్యారని, ఇంతటి అత్యున్నత స్థానంలో ఉండటానికి సీఎం జగన్ మోహన్‌రెడ్డి ఆశీస్సులే కారణమని చెప్పారు. దుర్మార్గంగా వ్యవహరిస్తున్న రూరల్ ఎమ్మెల్యే నుంచి దూరంగా వచ్చి అందరితో సఖ్యతగా మెలిగి ప్రజల్లో మంచి పేరు తెచ్చుకోవాలని కోరారు. విజయ డెయిరీ చైర్మన్ రంగారెడ్డి, డీసీసీబీ మాజీ చైర్మన్ ఆనం విజయకుమార్‌రెడ్డి, కార్పొరేటర్లు గౌరి, విజయభాస్కర్‌రెడ్డి, శ్రీనివాసులురెడ్డి, కో ఆప్షన్ సభ్యుడు మల్లికార్జునయాదవ్, తదితరులు పాల్గొన్నారు.

షాదీమంజిల్ అభివృద్ధి కమిటీ ఏర్పాటుకు వినతి



వినతిపత్రమిస్తున్న డిప్యూటీ మేయర్, తదితరులు

నెల్లూరు(బారకాసు): నగరంలోని కోటమిట్టలో గల షాదీమంజిల్‌కు అధికారులు, మైనార్టీ నేతలతో అభివృద్ధి కమిటీని ఏర్పాటు చేయాలని డిప్యూటీ మేయర్ ఖలీల్ అహ్మద్, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మైనార్టీ విభాగ రాష్ట్ర కార్యదర్శి హంజా హుస్సేనీ కోరారు. కార్పొరేషన్ కార్యాలయంలో కమిషనర్ వికాస్ మర్మత్‌కు వినతిపత్రాన్ని బుధవారం అందజేసిన అనంతరం డిప్యూటీ మేయర్ మాట్లాడారు. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా ఎమ్మెల్యే అనిల్ కుమార్ సహకారంతో కోటమిట్టలో షాదీమంజిల్‌ను నిర్మించారని చెప్పారు. గత ప్రభుత్వంలో షాదీమంజిల్‌కు శ్లాబ్ వేసి వెళ్లిపోయారని, అప్పటి నుంచి ఎవరూ పట్టించుకోలేదని, చివరికి ఎమ్మెల్యే సహకారంతో నిర్మాణాన్ని పూర్తి చేశారని వివరించారు. జిల్లాలోని దర్గాలు, మసీదులకు అభివృద్ధి కమిటీలు ఉన్నాయని, ఇవి అభివృద్ధి కోసమే గానీ ఎలాంటి లాభాపేక్ష కోసం కాదని తెలిపారు. అనంతరం హంజా హుస్సేనీ మాట్లాడారు. షాదీమంజిల్‌కు అభివృద్ధి కమిటీని ఏర్పాటు చేయాలని మాత్రమే కోరామని, అయితే దాన్ని పక్కనబెట్టి అజెండాలోని తొమ్మిదో అంశంలో లీజు అనే పదాన్ని ఎవరు చేర్చారో అర్థం కావడంలేదన్నారు. ఇలా చేర్చిన వారిపై క్రమశిక్షణ చర్యలు చేపట్టాలని కోరారు. కార్పొరేటర్లు కరిముల్లా, సఫియాబేగం, కో ఆప్షన్ సభ్యుడు జమీర్, వక్ఫ్ బోర్డు జిల్లా చైర్మన్ మీరామొహిద్దీన్, పార్టీ మైనార్టీ జిల్లా అధ్యక్షుడు సిద్ధిఖ్, పార్టీ నేతలు అతహర్‌బాషా, తారిక్, బాబాభాయ్, మైనుద్దీన్, తదితరులు పాల్గొన్నారు.

సౌందర్యలహరిపై ప్రవచనాలు



నెల్లూరు(బృందావనం): అమ్మవారు వివిధ రూపాల్లో భక్తులను అనుగ్రహిస్తారనే వైనం శంకరభగవత్పాదుల వారు చెప్పిన సౌందర్యలహరిలో తెలుస్తుందని ఉపన్యాసకుడు మల్లాప్రగడ శ్రీమన్నారాయణమూర్తి ప్రవచించారు. ఆదిశంకర జయంత్యుత్సవాల్లో భాగంగా సౌందర్యలహరిపై బుధవారం ఆయన ప్రవచించారు. రుద్రాభిషేక అర్చనలు, వేదపారాయణాన్ని ఉదయం నిర్వహించారు. అనంతరం శ్రీమన్నారాయణమూర్తిని సత్కరించారు. శ్రీనివాసులు, ప్రభాకర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

రాజరాజేశ్వరిగా మహాలక్ష్మి



నెల్లూరు(బృందావనం): పప్పులవీధిలోని మహాలక్ష్మి దేవస్థానంలో నిర్వహిస్తున్న వార్షిక వసంత పరిమళ కొతాయి మహోత్సవాల్లో భాగంగా అమ్మవారు రాజరాజేశ్వరి అలంకారంలో దర్శనమిచ్చారు. దేవాలయ పునర్నిర్మాణ కమిటీ సభ్యులు శ్రీరామ్ వెంకటసురేష్, రవి, నరేంద్రనాథ్, బాలాజీ, ఈఓ హేమచంద్రరావు పర్యవేక్షించారు.

విశేషాలంకారంలో మూలస్థానేశ్వరుడు

నెల్లూరు(బృందావనం): మూలాపేటలోని భువనేశ్వరి సమేత మూలస్థానేశ్వరాలయంలో వసంతోత్సవాలను వేడుకగా నిర్వహిస్తున్నారు. స్వామివారు కిరాతార్జునీయ అలంకారంలో బుధవారం దర్శనమిచ్చారు. ఉభయకర్తగా ధరణికృష్ణ వ్యవహరించారు.



వాసవీ అలంకారంలో కన్యకాపరమేశ్వరి



నెల్లూరు(బృందావనం): స్టోన్‌హౌస్‌పేటలోని కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో నిర్వహిస్తున్న అమ్మవారి జన్మదిన మహోత్సవాల్లో అమ్మవారు వాసవీ అలంకారంలో దర్శనమిచ్చారు. ఉభయకర్తలుగా ముక్కాల ద్వారకానాథ్, ఆదిలక్ష్మీకుమారి దంపతులు, సత్యనారాయణ, వ్యాసప్రసాద్ కుటుంబసభ్యులు వ్యవహరించారు. దేవస్థాన పాలకమండలి చైర్మన్ మనోహర్, కోశాధికారి శ్రీనివాసులు, శ్రీరామ్ సురేష్, శరణ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

రాహుల్ గాంధీకి మద్దతుగా ప్రచారం

నెల్లూరు(అర్బన్): కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీకి మద్దతుగా ప్రచారాన్ని గైనకాలజిస్ట్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షురాలు యశోధర ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. గాంధీనగర్, వేదాయపాళెం, తదితర ప్రాంతాల్లో ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేశారు. షాహినా, ఖాదర్‌బాషా, రఫీ, యజ్దాన్, సాజిద్, తదితరులు పాల్గొన్నారు.

దోపిడీ కేసులో ఇద్దరి అరెస్ట్

నెల్లూరు(క్రైమ్) : మద్యం దుకాణంలోని సేల్స్‌మెన్‌ను బెదిరించి రూ.వెయ్యి నగదు, క్వార్టర్ మద్యం బాటిల్‌ను దోచుకెళ్లిన ఘటనలో ఇద్దరు పాతనేరస్తులను చిన్నబజార్ పోలీసులు బుధవారం అరెస్ట్ చేశారు. వీరి సమాచారం మేరకు.. కిసాన్‌నగర్‌కు చెందిన ప్రశాంత్ మూలాపేటలోని అలంకార్ సెంటర్‌లో ప్రభుత్వ మద్యం దుకాణంలో సేల్స్‌మెన్‌గా పనిచేస్తున్నారు. మన్సూర్‌నగర్‌కు చెందిన సోహైల్, కుక్కలగుంట మున్సిపల్ క్వార్టర్స్‌కు చెందిన హరి పాతనేరస్తులు. ఈ క్రమంలో ఈ నెల 23న రాత్రి వీరు మద్యం దుకాణం వద్దకు వచ్చి తాగేందుకు డబ్బులివ్వాలని.. లేకపోతే చంపుతామని ప్రశాంత్‌ను బెదిరించి అతని జేబులో ఉన్న రూ.వెయ్యి నగదు, మద్యం దుకాణంలో క్వార్టర్ బాటిల్‌ను దోచుకెళ్లారు. దీనిపై ప్రశాంత్ చిన్నబజార్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన ఇన్‌స్పెక్టర్ సురేంద్రబాబు నిందితుల కోసం గాలించి పుత్తా ఎస్టేట్స్ సమీపంలో అరెస్ట్ చేశారు.

ఇంటర్‌లో 'కృష్ణచైతన్య' విజయదుందుభి



నెల్లూరు (టౌన్): ఇంటర్ ఫలితాల్లో కృష్ణచైతన్య కళాశాల విద్యార్థులు విజయఢంకా మోగించారని కళాశాల డైరెక్టర్లు కృష్ణారెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. విద్యార్థులను బుధవారం అభినందించిన అనంతరం వారు మాట్లాడారు. ఎంపీసీలో ఫాతిమా 465, నిఖిల 463 మార్కులను సాధించారని చెప్పారు. సీనియర్ ఇంటర్ ఎంపీసీలో సువర్ణ 987, దేవిసాయి సుస్మిత 986 మార్కులను సాధించారన్నారు. కళాశాల డైరెక్టర్ రాణా ప్రమోద్‌రెడ్డి, డీన్ శిరీష్, అకడమిక్ డీన్ రామ్‌గోపాల్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రైతులకు సకాలంలో సేవలందించాలి

కొడవలూరు: రైతులకు సంబంధించిన ఏ సేవలైనా సకాలంలో అందించాలని కావలి ఆర్డీఓ శీనానాయక్ సూచించారు. మండల తహసీల్దార్ కార్యాలయాన్ని బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి సిబ్బందితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ రైతులకు భూ హక్కు పత్రాలు సకాలంలో అందజేయడంతో పాటు ఈ–కేవైసీ తప్పక చేయించాలన్నారు. రీ సర్వే పూర్తయిన గ్రామాల్లో రైతుల సమక్షంలోనే హద్దు రాళ్లు నాటడాన్ని వెంటనే పూర్తిచేయాలన్నారు. రైతులకు సంబంధించిన సేవలను నిర్దేశించిన సమయంలోగా విధిగా పూర్తి చేయాలన్నారు. నిర్దేశించిన గడువులోగా పూర్తి చేయని పక్షంలో సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సమావేశంలో తహసీల్దార్ రమాదేవి, డీటీలు గున్నం మల్లికార్జున, మధుసూదన్‌రావు, సర్వేయర్ మాబాషా, ఆర్‌ఐ చాణక్య, వీఆర్వోలు పాల్గొన్నారు.

బైక్‌ను ఢీకొన్న ఆటో

వెంకటాచలం: బైక్‌ను ఆటో ఢీకొనడంతో ఓ వ్యక్తి గాయపడ్డాడు. ఈ ఘటన కసుమూరు వద్ద బుధవారం చోటు చేసుకుంది. బుజబుజనెల్లూరు ప్రాంతానికి చెందిన షేక్ రసూల్ పని నిమిత్తం బైక్‌పై కసుమూరు వెళ్లి తిరిగి వస్తున్నాడు. కసుమూరు మలుపు వద్ద వెనుకగా బైక్‌ను ఆటో ఢీకొనడంతో రసూల్ గాయపడ్డాడు. క్షతగాత్రుడ్ని చికిత్స నిమిత్తం నెల్లూరులోని జీజీహెచ్‌కు తరలించారు. వెంకటాచలం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కానిస్టేబుల్ కుటుంబానికి అండగా ఉంటాం



కానిస్టేబుల్ భౌతికకాయానికి పూలమాల వేస్తున్న తిరుమలేశ్వరరెడ్డి

నెల్లూరు(క్రైమ్): అనారోగ్యంతో మృతి చెందిన కానిస్టేబుల్ రాజు కుటుంబానికి అండగా ఉంటామని ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి పేర్కొన్నారు. మాదరాజగూడూరులోని పల్లిపాళేనికి చెందిన రాము వెంకటాచలం పోలీస్‌స్టేషన్లో విధులు నిర్వర్తిస్తున్నారు. కేన్సర్‌తో బాధపడుతూ చెన్నైలోని అపోలో హాస్పిటల్లో మంగళవారం మృతి చెందారు. ఈ క్రమంలో పల్లిపాళెంలో రాము భౌతికకాయానికి ఎస్పీ పూలమాల వేసి నివాళులర్పించారు. అంత్యక్రియలకు రూ.50 వేల తక్షణ ఆర్థిక సాయాన్ని అందజేశారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించి అన్ని విధాలా ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. ప్రభుత్వం నుంచి అన్ని బెనిఫిట్స్ త్వరితగతిన వచ్చేలా చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. అనంతరం పోలీస్ లాంఛనాలతో రాము అంత్యక్రియలను నిర్వహించారు.

చలివేంద్రం ప్రారంభం



నెల్లూరు(అర్బన్): పొదలకూరు రోడ్డులోని ఇండియన్ రెడ్‌క్రాస్ కేన్సర్ ఇన్‌స్టిట్యూట్ వద్ద మజ్జిగ చలివేంద్రాన్ని రెడ్‌క్రాస్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో బుధవారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రెడ్‌క్రాస్ ఇన్‌చార్జి చైర్మన్ సుధీర్‌నాయుడు మాట్లాడారు. వేసవి ముగిసేంత వరకు మజ్జిగ చలివేంద్రాన్ని కొనసాగిస్తామని చెప్పారు. చలివేంద్రానికి మాలకొండయ్య ఆర్థిక సహకారం అందించారు. రెడ్‌క్రాస్ కమిటీ నేతలు రాజేంద్రప్రసాద్, సురేష్‌కుమార్‌జైన్, రంగారావు, సురేష్, కేన్సర్ ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ నాగేశ్వరరావు, చీఫ్ మెడికల్ ఆఫీసర్ లక్ష్మి, డిజాస్టర్ మేనేజ్‌మెంట్ కన్వీనర్ భాస్కర్‌రెడ్డి, ఏఆర్వీ కన్వీనర్ వెంకురెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కేన్సర్‌కు 'మెడికవర్'లో ఆధునిక వైద్యం



నెల్లూరు(అర్బన్): తమ ఆస్పత్రికి అనుబంధంగా పూర్తిస్థాయిలో కేన్సర్ ఇన్‌స్టిట్యూట్‌ను ప్రారంభించిన రెండేళ్లలోనే 12 వేల మందికిపైగా కేన్సర్ రోగులకు ఆధునిక వైద్యచికిత్సను అందించామని మెడికవర్ సూపర్‌స్పెషాల్టీ హాస్పిటల్స్ వైస్ ప్రెసిడెంట్ మహేశ్వరరెడ్డి పేర్కొన్నారు. నగరంలోని మెడికవర్‌లో కేన్సర్ విభాగాన్ని ప్రారంభించి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా ఆస్పత్రిలో డాక్టర్లు కేక్‌ను కట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రాష్ట్రంలోని దక్షిణాది జిల్లాల్లో ఎక్కడా లేని విధంగా నెల్లూరులోని మెడికవర్‌లో పూర్తి స్థాయి కేన్సర్ విభాగాన్ని ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. పెట్ స్కాన్ లాంటి ఆధునిక పరికరాలను ఏర్పాటు చేశామన్నారు. మెడికవర్ హాస్పిటల్స్ సీఈఓ అనిల్ కృష్ణారెడ్డి సొంత జిల్లా కావడంతో ఇక్కడి ప్రజలకు సేవలందించేందుకు గానూ కేన్సర్ ఇన్‌స్టిట్యూట్‌ను స్థాపించారని వివరించారు. తొమ్మిది వేల మందికి ఆరోగ్యశ్రీ ద్వారా ఒక్క రూపాయి ఖర్చు లేకుండా వైద్యం చేశామన్నారు. సెంటర్ హెడ్ గణేష్, సర్జికల్ ఆంకాలజిస్ట్ ముత్తు, డాక్టర్ అవినాష్, మెడికల్ ఆంకాలజిస్ట్ శ్రీవిద్య, రేడియేషన్ ఆంకాలజిస్ట్ ప్రియ, డాక్టర్ నవీన్‌రెడ్డి, మార్కెటింగ్ రీజినల్ హెడ్ ఉదయ్, తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు అభినందన



నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): అనంతపురంలో ఇటీవల నిర్వహించిన రాష్ట్రస్థాయి అండర్ – 17 టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నీలో విజేతగా నిలిచిన జిల్లా బాలుర జట్టును నుడా చైర్మన్ ముక్కాల ద్వారకానాథ్ అభినందించారు. తన కార్యాలయంలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. టెన్నిస్‌బాల్ క్రికెట్‌లో అద్భుతంగా రాణిస్తున్న క్రీడాకారులకు సింహపురి స్పోర్ట్స్ ఫౌండేషన్ ద్వారా పూర్తి సహాయ, సహకారాన్ని అందిస్తామని తెలిపారు. అనంతరం జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన సిద్ధార్థ, రవిచంద్ర, మణిదీప్, రామ్‌నందన్‌ను సత్కరించారు. సింహపురి స్పోర్ట్స్ ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి వీర వెంకటేశ్వర్లు, టెన్నిస్‌బాల్ క్రికెట్ అసోసియేషన్ సభ్యులు అజయ్‌కుమార్, జావీద్, రాజు, మమత, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఉపనయనాలు



నెల్లూరు(బృందావనం): శంకరజయంతిని పురస్కరించుకొని ఎఫ్‌సీఐ కాలనీలోని శ్రీనివాస కల్యాణ మండపంలో 11 మంది బ్రాహ్మణ బాలలకు ఉపనయనాలను తుమ్మగుంట బ్రాహ్మణ సేవా సంఘ ఆధ్వర్యంలో భాస్కరశర్మ శాస్త్రోక్తంగా బుధవారం నిర్వహించారు. అనంతరం మాజీ కార్పొరేటర్ భువనేశ్వరిప్రసాద్‌ను సత్కరించారు. రామశేషయ్య, కోటేశ్వరశర్మ, గంగాప్రసాద్, శ్రీధర్‌శర్మ, రామచంద్రమూర్తి, శ్రీనివాసశర్మ, సుబ్రహ్మణ్యం, గౌరీశంకర్, తదితరులు పాల్గొన్నారు.

'వికాస్ ఆరోగ్య దీపిక'కు విరాళం



నెల్లూరు(బృందావనం): వికాస్ ఆరోగ్య దీపిక పథకానికి దాతలు రూ.పది వేల విరాళాన్ని అందజేశారని నిర్వాహకుడు, 14వ డివిజన్ కార్పొరేటర్ ప్రతాప్‌రెడ్డి పేర్కొన్నారు. బాలాజీనగర్‌లోని వికాస్ ప్రజాహిత సేవా సమితి కార్యాలయంలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వెంకటరమేష్, ఆయన కుమారుడు విష్ణుతేజ ఈ మొత్తాన్ని అందజేశారని పేర్కొన్నారు.

గృహ నిర్మాణాలు వేగవంతం చేయండి

నెల్లూరు(బారకాసు): జగనన్న కాలనీ, టిడ్కో గృహాల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని కమిషనర్ వికాస్ మర్మత్ ఆదేశించారు. నగరపాలక సంస్థ కార్యాలయంలోని తన చాంబర్‌లో ఇంజినీరింగ్ అధికారులతో బుధవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. టిడ్కో గృహాల రిజిస్ట్రేషన్ ప్రక్రియకు సంబంధించి బ్యాంకుల నుంచి రుణ సౌకర్యాన్ని కల్పించి లబ్ధిదారులకు అందించాలని కోరారు. టిడ్కో గృహాలు మంజూరైన, స్వాధీనం చేసుకోని లబ్ధిదారులను ప్రత్యేక కేటగిరీగా పరిగణించి వారికి నోటీసులను జారీ చేయాలని ఆదేశించారు. రుణాల మంజూరు విషయమై ప్రత్యేక మేళాలను నిర్వహించాలని సూచించారు. లబ్ధిదారుల భాగస్వామ్యంతో జగనన్న కాలనీల్లో నిర్మిస్తున్న గృహాల్లో నాణ్యత ప్రమాణాలు పాటించేలా చూడాలని సూచించారు. టీపీఆర్వో ప్రసాద్, మెప్మా పీడీ రవీంద్రబాబు, హౌసింగ్ డీఈలు శ్రీహరిగోపాల్, దయాకర్, ఎస్ఈ సంపత్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

భూ హక్కు, రీ సర్వేపై సమీక్ష

జగనన్న శాశ్వత భూ హక్కు – భూ రక్ష పథకంలో భాగంగా నగరంలో రీ సర్వేను వేగవంతం చేయాలని కమిషనర్ వికాస్ మర్మత్ ఆదేశించారు. నగరపాలక సంస్థ పరిధిలో రీ సర్వే కార్యక్రమ పురోగతిపై కార్పొరేషన్ కార్యాలయంలోని తన చాంబర్‌లో రెవెన్యూ, టౌన్‌ప్లానింగ్ విభాగాల అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. వార్డు సచివాలయ అడ్మిన్, ప్లానింగ్, రెవెన్యూ సెక్రటరీల సమన్వయంతో భూ హక్కు రీ సర్వే పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. నిర్ణీత గడువులోపు ప్రక్రియను పూర్తి చేసి సమగ్ర సమాచారాన్ని ఆన్‌లైన్లో పొందుపర్చాలని ఆదేశించారు. డిప్యూటీ కమిషనర్ చెన్నుడు, తదితరులు పాల్గొన్నారు.

వ్యర్థాలను యుద్ధప్రాతిపదికన తొలగించాలి

నగరపాలక సంస్థ పరిధిలోని అన్ని ప్రధాన కాలువల్లో పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థాలు, గుర్రపుడెక్కను యుద్ధప్రాతిపదికన తొలగించి నీటి పారుదలకు అంతరాయం లేకుండా చూడాలని కమిషనర్ వికాస్ మర్మత్ ఆదేశించారు. పరమేశ్వరినగర్, పాత మున్సిపల్ కార్యాలయం, తదితర ప్రాంతాల్లో ఇంటింటి చెత్త సేకరణ పనులను పరిశీలించారు. ఉయ్యాలకాలువ, రామిరెడ్డికాలువల్లో పేరుకుపోయిన వ్యర్థాలను గమనించిన ఆయన గ్యాంగ్ వర్క్ ద్వారా కాలువల్లో పూడికతీత పనులను వెంటనే చేపట్టాలని సూచించారు. అనంతరం పాత మున్సిపల్ కార్యాలయ సమీపంలో పెన్నా తీరంలో నిర్మిస్తున్న హిందువుల కర్మక్రతువుల భవన పనులను పరిశీలించారు. ఇంజినీరింగ్ విభాగ ఎస్ఈ సంపత్‌కుమార్, ఈఈ చంద్రయ్య, తదితరులు పాల్గొన్నారు.

త్వరితగతిన నాడు – నేడు పనుల పూర్తి

నగరపాలక సంస్థ పరిధిలోని మున్సిపల్ పాఠశాలల్లో చేపట్టిన నాడు – నేడు పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కమిషనర్ వికాస్ మర్మత్ ఆదేశించారు. నాడు – నేడు పనుల పురోగతిపై మున్సిపల్ హైస్కూళ్లు, ప్రాథమికోన్నత, ఉర్దూ పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో సమీక్ష సమావేశాన్ని కార్పొరేషన్ కార్యాలయంలోని అబ్దుల్ కలామ్ సమావేశ మందిరంలో నిర్వహించారు.